# ప్రతిస్పందన

మంచంమీద స్పృహ లేకుండా పడివున్న సుజాతను చూస్తూంటే గుండె చెరువైపోతోంది చిట్టిరాజుకి.

తనని దారిలో పెట్టడానికి చేసిన ప్రయత్నంలోనే వయసంతా తరిగిపోయినట్టు అక్కడక్కడ నెరసిన జుత్తూ....తను చేస్తున్న తప్పుడు పనులు చూస్తూ అణచిపెట్టుకున్న బాధని తెలియజేస్తున్న కంటికింది నల్లనిచారలూ....ప్రేమించానని వెంటపడిన తనని వదులుకోనూలేక, తనబలహీనతల్ని క్షమించనూలేక పడిన సంఘర్షణని వ్యక్తంచేస్తోన్న వడలిపోయిన ముఖమూ....

చిట్టిరాజుకి దుఃఖం పొర్లిపొర్లి వస్తోంది. తనుచేసిన తప్పుడు పనులన్నీ కసికొద్దీ డబ్బు సంపాదించడానికేననీ, సంపాదించిన డబ్బంతా ప్రాణంలో ప్రాణంలా ప్రేమించిన సుజాతను సుఖపెట్టడానికేననీ సుజాతకి ఎన్ని విధాల, ఎన్నిసార్లు, ఎంత వివరంగా చెప్పేడు! అర్థంచేసుకోదేం?

మూడేళ్ళ కాపరంలో ఎప్పుడూ పోరే మానెయ్యమని! నిజమే....ఇప్పుడనిపిస్తోంది. ప్రాణాధికంగా ప్రేమించిన సుజాత కోసమైనా తనెందుకు ఈ డబ్బు సంపాదించే ప్రయత్నాన్ని

విరమించుకోలేదు? డబ్బుతో సుఖంలేదని సుజాత ఎన్నిసార్లు మొత్తుకున్నా డబ్బుమీదెందుకు తనకంతకసి?

అవును....డబ్బును చూసినా, డబ్బున్నవాళ్ళని చూసినా చిట్టిగాజుకి కసి తన్నుకొస్తుంది.

నిద్రపోతున్నట్టుగా వున్న సుజాత తల నిమిరేడు. విడివడని ఆ కళ్ళకు విచ్చుకున్న కళ్ళతో చెప్పేడు.

"సుజాతా....నాకెందుకంత కసో నా గుండెల్లోకి దూరి ... నా బాల్యంలోకి చూడు సుజాతా...."

x x x x

పేలికలు పేలికలుగా వేళ్ళాడుతూన్న బట్టలతో రోడ్డు మీదున్న పారేసిన చిరిగిపోయిన చెత్తబుట్టలా వున్నారా పిల్లలు. ముట్టుకుంటే చేతికి మట్టి అంటుకుంటుందేమో నన్నట్టుగా పేక బెత్తంతో తరుముతోంది మేట్రన్.

"వెధవల్లారా....మీకెన్నిసార్లు చెప్పాల్రా...కుక్కల్లాగా కాట్లాడుకోవద్దని.. పైగా లోపల్లోపలికి దూరేస్తారు...ఈ వరండా దాటి వచ్చేరో...చచ్చేరే జాగ్రత్త ..." అరుస్తోంది వగరుస్తూ.

"అమ్మా... అమ్మా...ఆకలేస్తుందమ్మా...." అంటూ వెక్కిళ్ళతో దెబ్బల్నికూడా లెక్కచెయ్యకుండా చిట్టిగాడు మాత్రం అక్కడే నిలబడ్డాడు.

'చిట్టి ముందు, వాడి ఆకలి ముందు దెబ్బలు కూడా ఓడిపోతాయ్...' అనుకుంటూ ఎప్పటికప్పుడే ఆశ్చర్య పోతూ వుంటుంది మేట్రన్.

"ఇప్పుడంటే ఇప్పుడిచ్చేను రొట్టెముక్క.... మింగేసి మిడిగుడ్లేసుకు చూస్తున్నావురా ...దొంగగాడిదా ..." అంటూ మర్రెండు తగల్నిచ్చింది.

"అల్లాడు లాగీసుకున్నాడు...." రెండు దెబ్బల్నీ రెండు రొట్టె ముక్కల్లా చప్పరించేసి నిటారుగా నిలబడ్డాడు చిట్టిగాడు.

"ఈ వెధవతో నాకు చావొచ్చిపడింది. ఎంత పెట్టినా మింగేస్తాడు.తన్నినా కదల్డు...."అని దండకం చదువుతూ బడిత పూజ చేసేదే.కాని వరండాలోంచి తిన్నగా కనిపిస్తున్న ఇనపగేటు లోంచి పడవలాంటి కారు రావడం గమనించింది మేట్రన్.

అంతే..ఓ రొట్టె ముక్క వాడి ముఖం మీదికి గిరాటే సింది. అక్కడినుండి తోసేస్తున్నట్లుగా తరిమేసింది. మొఖాని కంతటికీ నవ్వు పులుముకుంది. వరండాలోంచే కారుకి నమ స్కారం చేస్తూ గునగున నడిచి ఎదురెళ్ళింది మేట్రన్.

అది నగరంలో పేరు పొందిన నర్సింగ్‌హోమ్. అనేక అంతర్జాతీయ సంస్థలద్వారా ఆర్థిక సహాయం పొందుతూ అధునాతన వైద్య పరికరాలతో పాటు అధునాతన సౌకర్యా లున్న గదులతో, పేరు పొందిన వైద్యుల సేవాసహకారాలతో వెలిగిపోతుండే నర్సింగ్‌హోమ్ అది.

చేతిలో డబ్బులుండాలేగాని నగరంలోనే కాదు రాష్ట్రం లోనే ఎంతపేరు ప్రతిష్టలున్న డాక్టరునైనా పగ్గం వేసి లాక్కు రావచ్చునక్కడికి.

డబ్బున్నవాళ్ళకే కాదు. చిట్టిగాడిలాంటి అనాథల్ని కూడా చేరదీసి వారిబాగోగుల్ని చూడ్డానికి ఆ కాంపౌండులో ఎంతో ఔదార్యంతో దాతలిచ్చిన విరాళాలతో నడిచే ప్రత్యేక మైన శరణాలయం కూడా వుంది ఆ నర్సింగ్‌హోంలో.

పడవలాంటి ఆ కారులో ఎర్రగా ఓ మనిషి మరింత ఎర్రగా వున్న కాలుని కారు దగ్గరికి వచ్చిన వార్డుబోయ్‌ల చేతుల్లో పెట్టేడు. అదే మహాప్రసాదంలా దాన్నందుకున్నారు వాళ్ళు.

ఆయన ఆరోజే పోర్టులో ఆగిన బ్రిటిషు నౌక కెప్టెన్ స్కాట్. ప్రమాదవశాన విరిగిన కాలుకి చికిత్స కోసం వచ్చేడు.

మరుసటి రోజున....

మేడ మీద గదిలో స్కాట్, వెనక దిళ్ళని ఆనుకుని సుఖంగా కూర్చుని వున్నాడు. యధాప్రకారం రొట్టెల పంపకం చేస్తోంది మేట్రన్. చెత్తబుట్టల్లాంటి పిల్లలతో సమానంగా ఖాళీ రేకుడబ్బాలా కేకలేస్తోంది మేట్రన్ కూడా.

విశ్రాంతిగా కూర్చుని కిటికీలోనుండి ఇదంతా చూస్తున్నాడు స్కాట్. వింతగా వుందతనికి. అందులోనూ దెబ్బలకీ, కేకలకీ అతీతుడిగా నిక్కచ్చిగా నిలబడ్డ చిట్టిగాడి మీద వుంది అతని దృష్టి.

"మేట్రన్...." అని పిల్చేడు.

తలెత్తి చూసి...."ఎస్ సర్...." అంటూ అటెన్షన్‌లో జవాబు చెప్పింది.

"వెధవల్లారా ... మీతో నాకెప్పుడూ చావే....పొండి పొండి...." అంటూ బెత్తం ఎత్తబోయి మీదినుండి విదేశీయుడు చూస్తుండటంతో నవ్వు మొహంతోనే కసిరింది.

"నోనో ...సిస్టర్....బ్రింగ్ దట్ బోయ్" అంటూ చూపించేడు స్కాట్. అతనివేలు చూపిన దిశగా చూసింది మేట్రన్. చిట్టిగాడు నిలబడి వున్నాడక్కడ.

'వీడితోబాటు నాకూ, నాతోబాటు వీడికీ ఆయువు మూడిందివాళ'-గొణుక్కుంటూ అని—

"పదరా....దొంగ వెధవా...." అంటూ ముందుకు తోసింది.

మేట్రన్ స్కాట్ గదిలోకి గడగడలాడుతూ అడుగు పెడుతూంటే....ఠీమాగా, దర్జాగా అంతా పరిస్తూ లోపలికి వచ్చేడు చిట్టిగాడు. మంచానికి అంత దూరంలో నిలబడిపోయిన వాణ్ణి చూస్తూ...."కమాన్ బోయ్...."అంటూ తన పక్కన చోటు చూపించేడు. చిట్టిగాడు జంకకుండా తిన్నగా వెళ్ళి కూర్చున్నాడు. పక్కనే స్టూలు మీదున్న ఆపిల్స్, ద్రాక్షపళ్ళవైపే చూస్తున్న చిట్టిని గమనించి ఓ ఆపిలు చేతికిచ్చేడు స్కాట్.

వాడెంతో ఆబగా తింటూ వుంటే వింతగా చూస్తూ-

"వాట్స్ యువర్ నేమ్ బోయ్?" అనడిగేడు.

వాడిపనిలో వాడున్నాడు చిట్టిగాడు. "ఆఁ?" అని మేట్రన్ వైపు ప్రశ్నార్థకంగా చూసేడు స్కాట్.

"చిట్టి అంది మేట్రన్.

"చీ..టీ.. హహ్హా....గుడ్ గుడ్ చీటీ..." అంటూ ఆనందంతో వాడి వీపు తట్టి మేట్రన్‌తో "బీక్వైండ్ అన్నాడు" స్కాట్. మూడు నాలుగురోజుల తర్వాత ఓరోజు మేట్రన్‌ని పిలిచి స్కాట్ ఓ విషయం చెప్పేడు.

ఈ రెండ్రోజులుగా జరుగుతున్నదంతా కళ్ళారా చూస్తూ కూడా నమ్మలేకపోతోంది మేట్రన్. ఇప్పుడతను చెప్పిన విషయం విని గునగున నడిచి వెళ్ళబోయి బొంగరంలా గుండ్రంగా తిరుగుతూ, మెట్లమీదినుండి చక్రంలా దొర్లుతూ, సూపరింటెండెంటు ముందుకు బంతిలా ఎగిరి వచ్చిపడింది. కనిపించిన డాక్టర్లకందరికీ చెప్పింది. సిస్టర్లకి చెప్పింది. వార్డుబోయ్‌లకి చెప్పింది. స్వీపర్లకి చెప్పింది. చెప్పడానికింకెవరూ కనిపించక పోయేసరికి స్కాట్ చెప్పినది తనకి తనే చెప్పుకుంది.

"ఐ వాంట్ టు ఎడాప్ట్ చీ....టీ"

ఆ రోజు నుండి చిట్టిగాడి జాతకమే మారిపోయింది.

చీమిడి ముక్కుతో, చిదిమితే నలుపు మాత్రమే కారే బుగ్గల్తో, పేలికల బట్టల్తో వుండే చిట్టిగాడు ఇప్పుడు మూడు పూటలా సబ్బు నల్లబడేటట్టు స్నానం చేస్తున్నాడు. ఫుల్ సూటులో టకటక నడుస్తున్నాడు. నగరంలో ఏ హోటల్లో ఏమున్నా లేకపోయినా చిట్టిగాడి కడుపులో మాత్రం రకరకాల వంటకాలు పడుతున్నాయి. షిప్‌నుండి ఆటసామాను వచ్చింది.

షిప్‌లాంటి కారెక్కి షికార్లు చేసేడు. కాలు కాస్త స్వాధీనం లోకి వచ్చాక స్కాట్ దగ్గరుండి షిప్పెక్కించి చూపించేడు చిట్టిగాడికి.

స్కాట్ దొర చిట్టిగాడిలో ఏం చూసేడో....!

నెల్లాళ్ళ చికిత్స పూర్తయ్యే సరికి స్కాట్‌కు పూర్తిగా నయమయింది. ఈలోగా చిట్టిగాడిని కూడా తనతో తీసుకువెళ్ళ డానికి ఎంబసీలో ఏర్పాట్లు చేసేడు కాని వాడి దురదృష్టం చిట్టిగాడికి అనుమతి లభించలేదు.

నర్సింగ్‌హోమ్ సూపరింటెండెంట్‌నీ, మరికొంత మంది పెద్దల్ని పిలిచి సమావేశం ఏర్పాటుచేసేడు స్కాట్. చిట్టిగాడు తన కొడుకన్నాడు. వాడి పేరుమీద కొంత డబ్బు ఏర్పాటు చేసేడు.దాని మీద వచ్చే వడ్డీ....వాడిని పోషించడానికీ, తిండీ బట్టా ఖర్చుకీ, జాగ్రత్తగా సాకడానికీ వుపయోగించమని, అవసర మైన దానికన్నా ఎక్కువే మేట్రన్‌కి భృతి ఏర్పాటు చేశాడు. చక్కగా పెంచమన్నాడు. చదివించమన్నాడు. పెద్దయ్యాక ఆ డబ్బు వాడికందించమన్నాడు.

స్కాట్ షిప్పెక్కవలసిన రోజు రానే వచ్చింది.

దొర చిట్టిగాణ్ణి వదల్లేక వదల్లేక వెళ్ళడం చూస్తే నర్సింగ్ హోమ్ సిబ్బందంతా విస్తుబోయారు.

చిట్టిగాడి వైభవం స్కాట్ దొరతోనే వెళ్ళిపోయింది!

నెల్లాళ్ళ బతుకు ఏమైపోయిందో ఎందుకుపోయిందో పసివాడి మనసుకేం తెలుసు? నెల్లాళ్ళ కిందటే హాయని పించింది. నెల్లాళ్ల తర్వాతి బతుకులో ఆకలి తప్ప ఏమీ తెలియలేదు చిట్టిగాడికి. మరింక ఆ ఆకలి తీర్చుకునే అవకాశం ఆ నర్సింగ్‌హోమ్‌లో లేదని తెలిసిన మరుక్షణం చిట్టిగాడు రోడ్డున పడ్డాడు.

x x x x

"సార్ .. డాక్టరుగారొచ్చేరు." అంటోంది అటెండెంట్‌గా వచ్చిన నర్సు.

ఈ లోకంలోకి వచ్చేడు చిట్టిరాజు.

"డోంట్ వర్రీ అండ్ డోంట్ బి సిల్లీ చిట్టిరాజూ. షి విల్‌బి ఆల్‌రైట్....మీరోసారి అవతలికి వెళ్ళిరండి....ఈలోగా ఇంట్రావీనస్ ఇస్తాను" అంటూ చిట్టిరాజుని అవతలికి పంపేడు డాక్టరు. గది బయట కాఫీతో సిద్ధంగా వున్నాడు రామబంటు లాంటి నౌకరు. "బాబయ్యా పొద్దుటికాణ్ణుండి ఏవీ తీసుకోలేదు. కాసిన్ని కాఫీ నీళ్లైనా తాగండి బాబూ" అంటూ బతిమాలు కున్నాడు.

కాఫీ తాగి మళ్ళీ గదిలోకి వచ్చాడు చిట్టిరాజు.

ఎందుకనో సుజాత తనకు దక్కదనిపిస్తోంది. అంచే తనే ఒక్కక్షణం కూడా వృధా చెయ్యకుండా ఆమె దగ్గరే గడ పాలనిపిస్తోంది అతనికి.

"డోంట్ డిస్టర్బ్ హర్ మిస్టర్ చిట్టిరాజూ. సిస్టర్ బీకేర్ ఫుల్, అవసరమైతే ఫోన్ చెయ్యి" అంటూ హడావిడిగా వెళ్ళి పోయేడు డాక్టరు.

చిట్టిరాజు సుజాత పక్కనేడున్న కుర్చీలో కూర్చుని సుజాత ముఖంలోకి చూడసాగాడు....

ఈ బెడ్‌మీద నువ్వెన్నిసార్లు నాకు స్వర్గాన్ని చూపించేవు సుజాతా....శారీరక సుఖాలు నాకేం కొత్తకావు. కాని.. భార్యాభర్తల సంబంధంలో కొత్త అర్థానీ, కొత్త బాటనీ, కొత్త వెలుగునీ చూపించింది నీవుకాదూ....పడకగది రహస్యాలు నీకెలా తెలుసునని నన్నడిగేదానివికదూ సుజాతా.... అవెలా తెలిసేయో నీకెలా చెప్పేది...

x x x x

"రాజూ! రూమ్ నెంబర్ టూనాట్‌త్రీకి వెళ్లు...పంపించమన్నారు" అన్నాడు లాడ్జి సాత్రమాట్ ప్రొప్రయిటర్.

"ఎస్సార్" అంటూ చకచకా మేడ మెట్లెక్కి రూం తలుపు తట్టాడు రాజు.

"కమిన్" అందో కంఠం.

తలుపు తోసుకుని లోపలికి వెళ్ళేడు. ముందుకు వెళ్ళబోయి ఆగిపోయేడు. ఎదురుగా డబుల్‌కాట్ బెడ్‌మీద అతనూ, ఆమె! దుప్పటి కింద రెండు నగ్న శరీరాలున్నట్లు కళ్ళకు కడుతున్న ఊహ. రాజు ఒళ్ళు వేడెక్కిపోయింది.

"చికెన్ బిరియానీ, వైట్‌హార్స్. ఇప్పుడే కాదు ఓ గంట పోయేక తీసుకురా....వెళ్ళు...." అన్నాడతను.

"ఎస్సార్" అంటూ తన వెనకగా తలుపు మూసేడు రాజు.

ఎన్ని మళయాల సినిమాలు చూసేడో, అవన్నీ కళ్లారా చూడాలన్న కుతూహలం రాజును కుదిపేయసాగింది. ఇటూ అటూ వరండాలోకి చూసి చప్పున కీహోల్‌లో కన్ను పెట్టేడు.

ఒక్క కంటితో ఒక్క క్షణం చూసిన ఆ దృశ్యంతో రాజు ఒళ్ళంతా చమట పట్టేసింది. నాలుక పిడచకట్టుకు పోయింది. గజగజ వణుకు మొదలయ్యింది.

రెండంగల్లో కిందికి వచ్చేసేడు.

"ఏవిట్రా .. ఏమయ్యింది'' అంటూ రంగడు కుదుపుతూ అడిగేడు. రాజు చెప్పిందంతా విని ఫకాలున నవ్వేడు రంగడు.

"చూస్తే మజా ఏముందిరా, రేపు రాత్రికి చేసుకుందాం మజా, వస్తావా?'' అనడిగేడు రంగడు.

మొలిచీ మొలవని మీసాలూ, రూపం మార్చుకుంటున్న కండలూ, రక్తం పోసుకుంటున్న అవయవాలూ ...పదహారేళ్ళ రాజు ఒంట్లో ఏదో తెలియని మార్పు కావాలని ఆరాటపెడు తున్నాయి- అంచేత "ఊఁ" కొట్టేడు వెంటనే.

అదుపూ, ఆజ్ఞా లేని బాధ్యతారహితమైన జీవితం. ఏది తప్పో ఏది ఒప్పో తెలియని వయసు. కోరికలు నిజం చేసుకో వాలనే శారీరక బలం. సాధించి తీరాలని వేడెక్కించే రక్తం.

అన్నిటినీ మించి తెగిన గాలిపటాల్లాంటివాళ్ళతో సావాసం. ఆ రోజు రాజు రంగడితో పాటు వెళ్ళాడు.

అక్కడ-

మురుగు నీటి కాలువలూ, చిరిగిపోయిన జీవితాల్లాంటి గుడిసెలు, కంపుకొట్టే బతుకుల్లోకి తలుపు తీసుకు వెళ్ళేడు రాజు.

ధైర్యం చెప్తూ బయటే ఉండిపోయేడు రంగడు.

గోడలకు వేళ్ళాడుతున్న కేలండరూ, పొగచూరిన గదీ, నులకజారిపోతున్న మంచం ఆమె జీవితానికీ, వయసుకీ, ఆరోగ్యానికీ ప్రతీకలుగా వున్నాయి. కానీ రాజుకవేవీ తెలియవు. కనిపించడం లేదు. వేడెక్కిపోతున్న శరీరమూ, జేబులోని పది రూపాయలూ ఏదో చేసెయ్యమని పురికొల్పుతున్నాయి.

డబ్బులు తీసి ఆమె చేతిలో పెట్టేడు రాజు.

ఇచ్చిన రూపాయలు తిరిగ్గా లెక్కపెడుతోంది.

ఆగలేక ఆమె భుజం మీద చెయ్యేసేడు రాజు.

వెంటనే రాజు బట్టల్లో చల్లదనం, చెమటా, తడీ అతన్ని ఆపేసేయి.

"బాబూ....నువ్వింకా చిన్నవాడివి... కొన్నేళ్ళు పోయేక ఇదే బాగనిపిస్తే మళ్ళీరా... ఇప్పటికి వెళ్ళు...." అంటూ ఇచ్చిన డబ్బుల్లో అయిదు రూపాయలు లెక్కపెట్టి జేబులో పడేసిందామె.

చెప్పరాని దుఃఖం వచ్చింది రాజుకి.

వెక్కిళ్ళు తన్నుకొచ్చేస్తూంటే వీపు మీద ఆమె చల్లని చెయ్యి "బాధపడకు ...ఇది నీ మంచికి...." అంది. గబగబా వచ్చేసేడు.

రంగడడిగేడు కాని జవాబు చెప్పలేదు. ఆ తర్వాత ఎన్నోసార్లడిగేడు. వాడడుగుతున్నకొద్దీ పట్టుదల పెరిగింది. అది తన మంచికే అని ఆమె ఎందుకన్నదో ఆలోచించని పట్టుదల. అదో పెద్ద అవమానంగా భావించిన వయసు. సాధించాలి.

పట్టుబట్టి సాధించాడు. ఆ వాడలో వున్నవాళ్ళందర్నీ సాధించాలి.

సాధిస్తున్నకొద్దీ తన స్టేటస్ పెరిగినట్టు గర్వంతో పొంగిపోయేడు రాజు.

x x x x

"అలా ఆమె వెక్కిళ్ళు పెడ్తూంటే చూస్తూ కూర్చున్నారేమిటి?" అని భుజం తట్టింది నర్సు.

"ఆ" అని తుళ్ళిపడి "సుజాతా" అని మంద్రంగా పిల్చేడు చిట్టిరాజు.

సుజాత పలకలేదు. నిశ్చింతగా నిద్రపోతున్నట్టే వుంది. మధ్యమధ్య వెక్కిళ్ళు, అంతే.

నర్సు గాభరాపడుతోంది. స్టాండుకున్న సెలైన్ బాటిల్ తీసి మరొకటి తగిల్చింది. దానినుండి జారిన ట్యూబును ఆమె

మోచేతి పైభాగాన సరిచేసింది. రెండో వైపునున్న సిలెండరును పరిశీలించింది. ఔన్సు గ్లాసులో ఏదో మందుపోసింది. ఆమె తలను నెమ్మదిగా ఎడంచేత్తో ఎత్తి మందు సుజాత నోటిలో పోసింది.

అంతా నిర్లిప్తంగా చూస్తూ కూర్చున్నాడు చిట్టిరాజు.

ఎందుకో మొండి ధైర్యం వచ్చేసింది. మూడేళ్ళ సంసారంలో అతనికి ముప్ఫయ్యేళ్ల స్వర్గం లభించింది. గాలిపటం లాంటి తన జీవిత సూత్రాన్ని ఆమె చేతిలో పెట్టి హాయిగా వుందామనుకున్నాడు. ఈ మూడేళ్లలో ఆమె మనోభావాలు గుర్తించేడు. జీవితాన్ని మార్చుకున్నాడు. అన్ని కోరికలూ తీర్చేడు. కాని, కాని అక్రమ సంపాదనఅంతా ప్రభుత్వం పాలుచెయ్యమంటుంది. అక్కడే, ఆ ఒక్క కోరికదగ్గరే పేచీ.

అంచేతనేకదూ నిద్రమాత్రలు పొడిపొడిచేసి మింగి ఇంతవరకూ తెచ్చుకుంది సుజాత.

ఆమె లేకుండా తన జీవితాన్ని ఊహించుకోలేకపోతున్నాడు. అయితే నిశ్చింతగా, నిర్భయంగా తనను గురించి పట్టించుకోకుండా సుజాత నిద్రపోతున్నట్లు ఊహించుకుంటున్నాడు. తన బాధకి అర్థంలేదని, తన భయానికి అంతంలేదని అనుకుంటున్నాడు.

మరంచేతనే మొండిగా చూస్తున్నాడు చిట్టిరాజు. తన మొండితనం వల్లనే తనెంతో సంపాదించేడు.

"సుజాతా....పీటన్నింటికంటె విలువైన నిన్ను నేనెలా సంపాదించుకున్నాను. ఈ అమూల్య సంపాదననుకూడా వదిలేయాలా...." అంటూ గొణుక్కున్నాడు చిట్టిరాజు.

x x x x x

"చిట్టిరాజూ....ఈ పని నీవల్లనే కావాలి" అన్నాడు జాక్సన్.

జాక్సన్ అప్పుడప్పుడు వచ్చి ఆ హోటల్లో బస చేస్తుంటాడు. వ్యాపారం సజావుగా సాగినంతకాలం ఆ హోటల్ లోనే వుంటాడు. రోజుకి యాభై రూపాయల చొప్పున అద్దె చెల్లించడంతోపాటు తిండికీ విలాసాలకీ ఎలా లేదన్నా రోజుకో వందపైగా ఖర్చు చేస్తూ నెల్లాళ్ళల్లో మూడు నాలుగువేల రూపాయలు తగలేసే జాక్సన్‌ను చూస్తుంటే చిట్టిరాజుకు అబ్బురంగా వుండేది.

చిట్టిరాజు చురుకుదనం చూసి చిన్న చిన్న పనులే అప్పగించేవాడు జాక్సన్. అయినా ఫలితం మాత్రం భారీగానే ముట్టజెప్పేవాడు. జాక్సన్ చేసే అంత గొప్ప వ్యాపారం ఏమిటో అనుకుంటూ భోగట్టా చేస్తే తెలిసింది-దొంగ నోట్ల వ్యాపారం అని.

"నా వల్ల ఏమవుతుంది సార్.?" అన్నాడు చిట్టిరాజు ఆశ్చర్యంగా.

"నీ చురుకుదనం నాకు తెలుసు. అవసరమైన మొండి ధైర్యం కూడా నీలో వుంది. నేను చెప్పిన పని చేసిపెట్టు.

నాతోపాటు తీసుకుపోతాను. ఇక్కడ రెండు మూడొందలు నెలకి సంపాదించి ఏం తింటావ్....బొంబాయికి ఛలో....ఏమం టావ్....మీవాళ్ళు పర్మిషను ఇవ్వరని ఏమైనా డౌటా....?"

విషాదంగా తలదించుకున్నాడు చిట్టిరాజు. తప్పయితే వద్దని చీవాట్లు పెట్టేందుకూ, ఒప్పయితే శభాష్ అని భుజం తట్టి ముందుకు తోసేందుకూ తనకెవరున్నారు....మొండి ధైర్యం, పట్టుదల తప్ప.

'సరే' అన్నాడు.

ఆ ముందు రోజే జాక్సన్ ఓ పార్టీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. లక్షకు పది లక్షలు. ఊరి చివర వెంకటే శ్వరస్వామి కోవెల దగ్గర ఆ రోజు సాయంత్రం ఏడుగంట లకు వెయిట్ చెయ్యాలి ఓ ఎర్రసూట్ కేసు పట్టుకుని. జాక్సన్‌కూడా ఎర్రసూట్‌కేసే ఇస్తాడు. మార్పిడి జరిగేక అంతా గప్‌చుప్.

చిట్టిరాజు సూట్ కేసు పటుకుని వెళ్ళేడు.

పార్టీకూడా రడీగా వుంది. ఎక్స్ఛేంజి జరిగింది.

చిట్టిరాజుకు సూట్‌కేసందుకోగానే ఉబలాటం ఆగలేదు. రెండడుగులు వెనక్కి వచ్చి సూట్‌కేసు తెరిచేడు.

అంతే తెలుసు. దభీ దభీమని నెత్తి మీదా, వీపు మీదా దెబ్బలు.

హాస్పిటల్లో కళ్ళు తెరిచేడు!

కళ్ళు తెరిచిన చిట్టిరాజుకి అందంగా వున్న అమ్మాయి కనిపించింది. గుడికొచ్చిందట. స్పృహతప్పి పడివున్న తనను హాస్పిటల్లో చేర్పించిందట.

ఆ తర్వాత కళ్లు మూసుకున్న చిట్టిరాజుకి కళ్ళకెదురుగా కట్టలు కట్టలుగా వందనోట్లు, జాక్సన్ ఇచ్చిన కట్టల్లో ముందూ వెనుకా తప్పించి అన్నీ తెల్లకాగితాలే అనీ....తాను రెండు క్షణాలు ఉబలాటంతో ఆలస్యం చేసినందుకు శిక్ష తను దెబ్బలు తినడమూ, అసలూ నకిలీ నోట్లన్నీ వాళ్ళపరం కావడమూ అనీ కాస్త ఆలస్యంగా ఇప్పుడర్థమవుతోంది.

వారం రోజులయ్యాక చిట్టిరాజు కొంచెం కుదుటబడ్డాడు. ఇన్నాళ్లుగా తన యోగక్షేమాలు విచారించడమే కాకుండా, పళ్ళూ ఫలహారాలూ తెస్తూ మానవత్వం వున్న దేవతలా అతన్ని ఆదరించిందా అమ్మాయి. ఆ అమ్మాయి తోడు తనకెంతో అవసరమని అపుడే తెలిసినట్టయ్యింది.

ఆ వేళ...

"మీరాపని చెయ్యకుండా వుండాల్సింది" అందామె.

"ఏపనీ....?" ఆశ్చర్యంగా అడిగేడు చిట్టిరాజు.

నవ్వింది. ఆ నవ్వు చిట్టిరాజు గుండెల్ని తాకింది. ఓసారి చేత్తో తడిమి చూసుకున్నాడు.

"నాకు తెలుసు....దొంగనోట్ల వ్యాపారం"

గుండె జారిపోయింది. "అబ్బే....నేను ..."తడబడ్డాడు.

"నాకేం సంబంధం లేదని అంటారు. అయినా దెబ్బలు తిన్నానంటారు. పట్టుపడ్డాక ప్రతీవాడూ చెప్పే మాటలే" అని మరోసారి నవ్వింది.

నివ్వెరపోయేడు చిట్టిరాజు. ఎలా చెప్పాలీమెకు?

"అయినా మీలో నిజాయితీ కనిపిస్తోంది కనకనే మిమ్మల్ని ఇష్టపడుతున్నాను. ఇంత సేపు మాట్లాడుతున్నాను."

అదిచాలు జీవితానికి!

"కాని అటువంటి పనులకు దూరంగా వుండి... అలా పంపాదించినదంతా ప్రభుత్వపరం చేసేస్తే ...నేను మరీ సంతో షిస్తాను."

అయితే ఆమెను ఆనందపరచాలి. కాని తనా వ్యాపారం చెయ్యనేలేదే. సంపాదన పెంచనేలేదే....ఎలా చెప్పాలి? అను కుంటుండగానే...."వస్తానూ" అని లేచిందామె.

"........" ఆర్ద్రంగా పిలవబోయేడు చిట్టిరాజు. పేరు తెలియదు. కాని అంతటి అర్ద్రిత కలిగించిన వ్యక్తి ఆమె ఒక్కతే. అతని మనసు గ్రహించిందామె.

"సుజాత ..."అని పేరు చెప్పి, అతని చేతి మీద నిమిరి వెళ్ళిపోయింది.

వారం రోజులుగా తానేమయ్యిందీ....ఎన్ని దెబ్బలు తిందీ....బతికి వున్నదీ లేనిదీ చూడని జాక్సన్ ఆమె వెళ్ళగానే వచ్చేడు.

చెంగున లేచి కాలరుపట్టుకోవాలన్న ఆవేశం వచ్చింది. కాని కాలూ చెయ్యీ స్వాధీనపడలేదు. అయితే కళ్ళతోనే కసి పెట్టగలడు జాక్సన్.

"ఆవేశపడకు రాజూ ...నేనింతవరకు రాలేదనేగా. నా మీదా, నీ మీదా పోలీసు నిఘా వుంది. అంచేత రాలేదు. సారీ....నేనీసారి తక్కువ రోజులకే బిచాణా ఎత్తేస్తున్నాను. నిన్ను మాత్రం ఇప్పట్లో తీసుకువెళ్ళలేను. అయినా నీకు దారి చూపిస్తాను. ఇదిగో ఇది వుంచు ..." అంటూ ఎంత వేగంగా వచ్చేడో అంతవేగంగానూ వెళ్ళిపోయేడు జాక్సన్.

చేతిలో పర్సు. పర్సులో చిన్న తెల్లకాగితం. కానీ, విలువైనది. తనకో పది బంగారు బిస్కెట్లు కేటాయించేడు. అవి ఎక్కడవున్నవీ వివరం రాసివుంది.

జాక్సన్‌పట్ల కృతజ్ఞతాభావం కలిగింది.

హోటల్లో ఉద్యోగం మానేసి కాలుమీద కాలు వేసుకుని జీవితం సాగించవచ్చు. కాని పోలీసు రికార్డుల్లోకెక్కిన తను నేరస్థుడే. ఎక్కడ ఇటువంటి నేరం జరిగినా తనని ఇరికించక మానరు.

అంచేత ఇది కొనసాగాలి. ఇదే పెట్టుబడిగా డబ్బు పెరగాలి. పలుకుబడి పెరగాలి. చాకచక్యంగా నెగ్గుకు రావాలి.

మరి సుజాత....?

అందుకే చిట్టిరాజుకి పూర్తి స్వస్తత చిక్కగానే అవతారం మార్చేసేడు.

x x x x

భుజం మీదపడ్డ చేతి స్పర్శకు ఉలికిపడ్డాడు చిట్టిరాజు. ఎదురుగా డాక్టరు!

"సారీ మిస్టర్ చిట్టిరాజూ....వియ్‌హేవ్ ట్రైడ్ అవర్ బెస్ట్....బట్ వియ్‌హేవ్‌నాట్ సేవ్డ్ యువర్ బెటర్‌హాఫ్.అయామ్ రియల్లీ సారీ...."

నెమ్మదిగా సుజాత ముఖం మీద దృష్టి నిలిపేడు.

నిర్మలంగా నిద్రపోతున్నట్టుగా వుంది సుజాత. భవ బంధాలన్నీ తెంచుకుని దీర్ఘ నిద్రపోతోంది.

చిట్టిరాజుకు ముఖంలో అనిర్వచనీయమైన శాంతి కన్పించింది. ఆమెకిప్పుడు ఏమీ కాదు. ''సుజాతా"....అని పొలికేక పెట్టినా ఆమెకు వినబడదు. ఆమె చెప్పినట్లు తన సంపాదనంతా వదులుకుంటే సంతోషిస్తాదన్న మాట ఇపుడబద్ధం.

అయినప్పటికీ సుజాత....తన ప్రాణం....తన జీవితం....

అనాథగా రొట్టెముక్క కోసం నర్సింగ్‌హోంలో దేబిరించిన చిట్టిగాడి బతుకూ, రూమ్‌బోయ్‌గా కడుపుకోసం లాడ్జిలో అడ్డమైన పన్లూ చేసిన రాజు జీవితమూ, తెగిన గాలిపటంలా జాక్సన్ చేతిలో చిక్కి దొంగ వ్యాపారపు ముళ్ళ కంచెలోపడ్డ చిట్టిరాజు భవిష్యత్తూ....